
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

సోమవారం 11 ఆగస్టు 2025

ష్...గప్‌చుప్

జిల్లాలో మినీ సంగ్రామాన్ని తలపించే విధంగా జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం ఆదివారం సాయంత్రం 5గంటలకు పరిసమాప్తమైంది. ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ నుంచి కూటమికి సంబంధించి మంత్రులు సవిత, రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్ధనరెడ్డి, ఫరూక్, విశ్వరూప్, ఎమ్మెల్యేలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఇక కలెక్టరు డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు 1400 మంది పోలీసులను నియమించారు. డీఐజీ కోయప్రవీణ్ ఆధ్వర్యంలో కడప ఎస్పీ అశోక్‌కుమార్ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు.

- జడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రచారం పరిసమాప్తం
- రేపే ఎన్నిక
- 1400 మందితో భద్రత
- పులివెందులలో ఓటుకు రూ.5 వేలు
- ఒంటిమిట్టలో రూ.3 వేలు



(కడప-ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని రెండుచోట్ల జరిగే జడ్పీటీసీ ఎన్నికల ప్రచారం నువ్వా.. నేనా.. అన్నట్లు సాగింది. ఆదివారం సాయంత్రానికి ప్రచార సమయం ముగియడంతో అంతా గప్‌చుప్‌గా మారింది. పులివెందుల నుంచి టీడీపీ జడ్పీటీసీ సభ్యురాలిగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి సతీమణి లతారెడ్డి పోటీ చేస్తుండగా, వైసీపీ నుంచి హేమంత్‌రెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడ 10,600 ఓట్లు ఉన్నాయి. మొత్తం ఇక్కడ 11 మంది పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నిక చాలా ప్రతిష్ఠాత్మకంగా మారింది. ఓ విధంగా చెప్పాలంటే వైసీపీకి డూ ఆర్ డైగా మారింది. ఇక టీడీపీ అనూహ్యంగా పుంజుకుంది. టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డిలు భుజాన వేసుకున్నారు. వీరికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సవిత, మంత్రి కొల్లు పార్థసారధి, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా చైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, బండారు శ్రావణి, భూపేశ్‌రెడ్డి, ఎంఎస్ రాజు, ఇతర టీడీపీ నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. ఇక మాజీ సీఎం జగన్ ఆదేశాలతో వ్యూహరచనతో ఎంపీ అవినాష్‌రెడ్డి వైసీపీ గెలుపు కోసం పాటుపడుతున్నారు. జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధరెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, కడప మేయరు సురేశ్‌బాబు, కర్నూలు, అనంతపురం జిల్లాలకు చెందిన వైసీపీ నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఈ రెండు ఘటనలు తీవ్ర ఉద్రిక్తతకు దారి తీయడంతో కలకలం రేపాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో చాలా రోజుల తరువాత మొదటిసారిగా జనం ఓటు వేయబోతున్నారు.



పులివెందుల మండలంలోని రాయలాపురం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి సవిత

ఒంటిమిట్టలో నువ్వా నేనా

ఒంటిమిట్టలో టీడీపీ నుంచి ఉప ఎన్నిక కోసం అద్దలూరు ముద్దుక్రిష్ణారెడ్డి, వైసీపీ నుంచి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిలు పోటీ చేస్తున్నారు. టీడీపీ గెలుపు బాధ్యతలను మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్ధనరెడ్డి, జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహనరాజు, ఫరూక్ గెలుపు కోసం భుజాన వేసుకున్నారు. మంత్రులు ఫరూక్, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పత్తిపాటి పుల్లారావు ఇతర టీడీపీ నేతలు ప్రచారం నిర్వహించారు. మంత్రులు, జిల్లా అధ్యక్షుడు లోకల్‌గానే ఒంటిమిట్టలోనే తిష్ఠ వేసి గెలుపు కోసం వ్యూహాలు అమలు పరుస్తున్నారు. ఒంటిమిట్టలో శ్రీరామ ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇక వైసీపీ తరపున ఎమ్మెల్యే అమర్‌నాథరెడ్డి, కడప మేయరు సురేశ్‌బాబు, గోవిందరెడ్డి ఇతర అన్నమయ్య జిల్లాకు చెందిన వైసీపీ నేతలు ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఇక్కడ మొత్తం 13 పంచాయతీలు, 24,600 ఓట్లు ఉన్నాయి. 11 మంది బరిలో ఉన్నారు.

ఓటుకు రేటు



జడ్పీటీసీ ఉప ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పార్టీలు అదేస్థాయిలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నాయి. పులివెందులలో గెలుపును వైసీపీ చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి ఓటుకు రూ.5వేలు పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. టీడీపీ కూడా అదే స్థాయిలో ఓటుకు నోటు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇక్కడ 10,600 ఓట్లు ఉన్నాయి. అంటే ఒక్కో ఓటుకు ఇరుపార్టీలు కలిసి రూ.10వేలు ఇస్తున్నారు. ఆదివారం రాత్రికే మొత్తం పంపిణీ పూర్తయినట్లు చెబుతున్నారు. ఇక ఒంటిమిట్టలో రూ.3వేలు వంతున పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో వైసీపీ రూ.4వేలు కూడా ఇచ్చినట్లు చెబుతున్నారు. మొత్తానికి పులివెందుల, ఒంటిమిట్టలో సుమారు రూ.25 కోట్లకు పైగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసినట్లు చర్చ సాగుతుంది.

భారీ బందోబస్తు

ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ తరువాత పులివెందులలో కొన్ని చెదరు మదరు సంఘటనలు జరిగాయి. దీంతో ఇక్కడ 700 మందితో భద్రత ఏర్పాట్లు చేశారు. మొత్తం ఇక్కడ 15 పోలింగ్ కేంద్రాలున్నాయి. అలాగే పోలింగ్ రూటులో సీఐ స్థాయి అధికారి, పోలింగ్ కేంద్రాల వద్ద ఎస్ఐని ఏర్పాటు చేస్తున్నారు. పులివెందులలో మొత్తం సమస్యాత్మక కేంద్రాలు కావడంతో స్పెషల్ పార్టీలు ఏర్పాటు చేసినట్లు డీఐజీ కోయప్రవీణ్ వెల్లడించారు. ఒంటిమిట్టలో సోమశిల అటవీ సమీప పరిధిలో ఉండే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇక్కడ కొందరు ఎర్రచందనం స్మగ్లర్లు ఉండడంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఐజీ వెల్లడించారు.



పులివెందుల మండలం అచ్చవెల్లి గ్రామంలో ప్రచారంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి

చెక్‌పోస్టులు ఏర్పాటు

పులివెందుల ఉప ఎన్నికల సందర్భంగా కడప ఎస్పీ ఆధ్వర్యంలో 6 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా సరిహద్దులో అద్దాలమర్రి బాట చెక్‌పోస్టు, అమగంపల్లె, పార్నపల్లె వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అలాగే కనంపల్లె, నల్లగొండుగారిపల్లె, రాయలాపురం, చందమామ డాబా, అలవలపాడు రోడ్డుసర్కిల్, ఎర్రపల్లి వద్ద చెక్‌పోస్టుల ఏర్పాటు చేసి పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, బంగారం, మద్యం తరలించకుండా నిఘా ఉంచారు.

పెరుగుతున్న నీటిమట్టం

- ఇన్‌ఫ్లో 16,220 క్యూసెక్కులు



గండికోట ప్రాజెక్టులోకి వేగంగా చేరుతున్న నీరు

కొండాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో రోజురోజుకు నీటిమట్టం వేగంగా పెరుగుతూ వస్తోంది. ప్రాజెక్టులోకి ఆదివారం వచ్చే ఇన్‌ఫ్లో 16,220 క్యూసెక్కులు ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో, మండలంలో శనివారం రాత్రి నుంచి కురిసిన వర్షం వల్ల వాగులు, వంకల ద్వారా గండికోట ప్రాజెక్టులోకి 3720 క్యూసెక్కుల వర్షపునీరు వచ్చి చేరినట్లు ఈఈ తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ వరద కాలువ ద్వారా వచ్చే కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 12,500 క్యూసెక్కులు ఉన్నట్లు ఉందన్నారు. ప్రస్తుతం సీబీఆర్‌కు వెయ్యి క్యూసెక్కులు, పెడిపాలెం రిజర్వాయిర్‌కు 400 క్యూసెక్కులు, జీఎన్ ఎస్ఎస్ మెయిన్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 17.224 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు. కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు.

పోలింగ్ కేంద్రాలన్నీ సమస్యాత్మకమే

700 మంది భద్రతతో పోలింగ్‌కు ఏర్పాట్లు ● డీఐజీ కోయ ప్రవీణ్



డీఐజీ కోయ ప్రవీణ్

పులివెందుల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలంలో ఉన్న పోలింగ్ కేంద్రాలన్నీ సమస్యాత్మకంగా పరిగణించామని డీఐజీ కోయప్రవీణ్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. పులివెందుల మండలంలోని ఆరు పంచాయతీల్లో 15 పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 12న ఎన్నికలు జరగనున్నాయని, ఈ పోలింగ్ కేంద్రాలన్నీ తొమ్మిది చోట్ల ఏర్పాటు చేశామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా పరగణించి ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. 700 మంది భద్రత సిబ్బందిని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఒక ఎస్ఐ, సీఐ స్థాయి అధికారితో ప్రత్యేక టీం ఉంటుందన్నారు. మొన్న జరిగిన ఒకటి రెండు సంఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బయటి నుంచి వచ్చిన ముఖ్యమైన నాయకులను, ప్రజలను ఇక్కడి నుంచి పంపించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. పులివెందుల పట్టణంలో ఎవరైనా ట్రబుల్ మాంగర్స్ ఉన్నా, వారి వల్ల ఎన్నికల్లో సమస్యలు వస్తాయనే పరిస్థితులు ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే మొన్న జరిగిన సంఘటనలకు సంబంధించి ఇరుపక్షాల పైన నాన్‌బెయిలబుల్ కేసులు, 150 మందిపై బైండోవర్ కేసులు పెట్టామన్నారు. ఏ చిన్న అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా బందోబస్తు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీనాయక్ పాల్గొన్నారు.

సింగిల్‌విండోలకు పాలకవర్గాలు

- జిల్లాలో 27 సంఘాలకు స్థానం

కడప రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కడప జిల్లాలో 27 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 821 సొసైటీలకు పాలకవర్గాలు ఖరారు కాగా ఇందులో జిల్లాలోని 27 సంఘాలకు స్థానం దక్కింది. స్థానిక ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు ప్రతిపాదించిన పాలకవర్గాల పేర్లను ఖరారు చే స్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులను జారీ చేసింది. ఈ పాలకవర్గాలు 2026 జనవరి 30 వరకు లేదా ఎన్నికలు జరిగి కొత్త పాలకవర్గాలు పగ్గాలు చేపట్టే వరకు గానీ లేదా తదుపరి ఉత్తర్వుల వరకు గానీ ప్రస్తుత పాలకవర్గాలు కొనసాగనున్నాయని సహకార శాఖ ఎక్స్ అఫిషియో ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఆదివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

27 సంఘాలకు స్థానం

వైఎస్ఆర్ కడప జిల్లాలో మూడవ విడత పాలకవర్గాల నియామకంలో భాగంగా 27 పీఏసీఎస్‌లకు కమిటీలను ఏర్పాటు చేసింది. ఇందులో ఆలంఖాన్‌పల్లి, దేవునికడప, చెన్నూరు, సీకేదిన్నె, సున్నపురాళ్లపల్లి, తిప్పలూరు, బి.కోడూరు, నరసాపురం, పోరుమామిళ్ల, సోమిరెడ్డిపల్లి, అల్లాడుపల్లి, చెన్నమరాజుపల్లి, పి.టంగుటూరు, కొండాపురం, జమ్మలమడుగు, ముద్దనూరు, పెద్దముడియం, లింగాల, చిన్నకుడాల, తొండూరు, బొక్కుడుపల్లి, యర్రబల్లి, నల్లచెరువుపల్లి, వేల్పుల, చింతలమడుగుపల్లి, మారెల్లమడక, బి.టి.పల్లి సొసైటీలు ఉన్నాయి.

81 మందికి నామినేటెడ్ పదవులు

మూడవ విడతలో జిల్లాలోని 27 వ్యవసాయ సహకార సంఘాలకు నామినేటెడ్ పాలకవర్గాలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఒక్కో కమిటీకి చైర్మన్‌తో పాటు, ఇద్దరు చొప్పున డైరెక్టర్లను ఏర్పాటు చేశారు. దీంతో మొత్తం 81 మందికి నామినేటెడ్ పదవులు దక్కాయి.

పోలీస్‌స్టేషన్ ముట్టడి 7

- బాలిక కిడ్నాప్ కేసులో న్యాయం చేయలేదని బాధితుల ఆవేదన

హవ్వా.. ఓటుకు రూ.10 వేలా..!

- తులసిరెడ్డి ఆశ్చర్యం 7

ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

- అరెస్టయిన వారిలో కరుడుగట్టిన ఇరువురు
- 52 దుంగలు, రెండు కార్లు, బైకు స్వాధీనం



ఎర్రచందనం దుంగలను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): లంకమల అటవీ ప్రాంతంలో ఎర్రచందనం చెట్లను నరికి వాటిని దుంగలుగా మార్చి కారులో అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఆరు మంది ఎర్రచందనం స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి దుంగలు, కార్లు, బైకు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టయిన వారిలో ఇరువురు బడా స్మగ్లర్లు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుల వివరాలను వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ చాపాడు మండలానికి చెందిన బడా స్మగ్లరు ఇరగంరెడ్డి నాగదస్తగిరిరెడ్డి, ప్రొద్దుటూరుటౌన్‌కు చెందిన ముదిరెడ్డి రాంమోహన్‌రెడ్డి, ప్రొద్దుటూరుటౌన్‌కు చెందిన ఉమ్మనబోయిన క్రిష్ణయ్య, పెండ్లిమర్రి మండలానికి చెందిన కావలి శ్రీనివాసులు, చక్రాయపేటకు చెందిన బి.ఓబుల్‌రెడ్డి, పెండ్లిమర్రికి చెందిన శనివారపు బాలగంగిరెడ్డిలు లంకమల అడవుల్లో తయారు చేసిన దుంగలను రెండు కార్లలో సిద్ధం చేసుకున్నారని ద్విచక్ర వాహనంలో మరో స్మగ్లరు పైలెట్‌గా వ్యవహరిస్తూ ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తున్నట్లు సమాచారం వచ్చినట్లు తెలిపారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ సీఐ శంకరరెడ్డి, మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, చాపాడు ఎస్ఐ చిన్న పెద్దయ్య, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో చాపాడు మండలంలోని ప్రొద్దుటూరు - అన్నవరం రోడ్డులోని వరదాయపల్లె గ్రామం వద్ద తనిఖీలు చేయడంతో ఎర్రచందనం స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేయగా చాకచక్యంగా అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుం చి రెండు కార్లు, టన్ను బరువున్న 52 దుంగలతో పాటు బైకు స్వాధీనం చేసుకున్నామన్నారు.

నాగదస్తగిరిరెడ్డి నేర చరిత్ర ఇలా..

గతంలో ఇరగంరెడ్డి నాగదస్తగిరిరెడ్డి ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతుండేవాడని, కర్ణాటక రాష్ట్రం కటికెనహళ్లికి చెందిన పలువురు స్మగ్లర్లతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నాడని ఎస్పీ తెలిపారు. మోస్ట్ వాంటెడ్ ఎర్రచందనం స్మగ్లరుగా ఎదిగాడని, కడప జిల్లాలో ఇతనిపై 86 ఎర్రచందనం కేసులు, 34 చోరీ కేసులు న్నాయని తెలిపారు. గతంలో మూడుసార్లు పీడీ యాక్టు నమోదు చేశారని ఇతని భార్య లాలూబీపై కూడా ఎర్రచందనం కేసులు నమోదై ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఆమె జైల్లో ఉందని తెలిపారు. ఇతని కుటుంబ సభ్యులు, అనుచరులు కూడా ఎర్రచందనం అక్రమరవాణా కేసులో ఉన్నట్లు తెలిపారు. కాగా స్మగ్లర్లను అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం

- 12న పులివెందుల, ఒంటిమిట్టలో పోలింగ్
- ప్రచారం బంద్
- స్థానికేతరులు స్వగ్రామంలో ఉండరాదు
- 12న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- 14న మౌలానా ఉర్దూ యూనివర్శిటీలో కౌంటింగ్
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్

కడప కలెక్టరేట్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఈ నెల 12న పోలింగ్ ఏర్పాట్లు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పూర్తి చేశామని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఈ నెల 12న జరగనున్న ఉప ఎన్నికల నేపథ్యంలో పులివెందులలో 15, ఒంటిమిట్ట 30 పోలింగ్ కేంద్రాల్లో జడ్పీటీసీ ఉప ఎన్నికల ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు, ఎన్నికల నియమావళి తదితర అంశాలపై ఎస్పీ అశోక్‌కుమార్, జడ్పీ సీఈవో ఓబులమ్మతో కలిసి కలెక్టర్ పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నియమ నిబంధనల మేరకు జడ్పీటీసీ ఉప ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల 12న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, బ్యాలెట్ బాక్సుల ద్వారా పోలింగ్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే ర్యాండమైజేషన్ పూర్తి చేశామన్నారు. ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగిసిందని, అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు, ఎటువంటి ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. అలాగే స్థానికేతరులు పోలింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు వారి ప్రాంతాలకు వెళ్లి పోవాలన్నారు. లేనిపక్షంలో ఎన్నికల నియమావళి ప్రకారం కేసులు నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. ఓటర్లకు పులివెందులలో 95 శాతం, ఒంటిమిట్టలో 96 శాతం మేర ఓటరు స్లిప్పులు పంపిణీ చేశామని, ఆదివారంలోగా మిగి లిన వారందరికీ ఓటరు స్లిప్పులు అందజేస్తామని తెలిపారు. పులివెందులలో 15, పోలింగ్ కేంద్రాలు, ఒంటిమిట్టలో 10 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. సీసీ కెమెరాలు, వెబ్‌క్యాస్టింగ్ ఉంటుందని, లేని చోట్ల మైక్రో అబ్జర్వర్లను నియమించామని తెలిపారు. కాగా 14న నగరంలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్శిటీలో కౌంటింగ్ ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి గత 10 రోజులుగా పులివెందుల, ఒంటిమిట్ట పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని, అవాంఛనీయ సంఘటనలకు తావులేదన్నారు. జిల్లాలో మొత్తం 13 చెక్‌పోస్టుల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే హోటల్స్, లాడ్జీలు, కళ్యాణమండపాలు పరిశీలిస్తున్నామని, ట్రబుల్ షూటర్స్, బాంబు మేకర్స్, రౌడీషీటర్స్ నేరచరిత్ర కలిగిన వారందరిని బైండోవర్ చేశామన్నారు. చెదురు ముదురు సంఘటనలు జరగకుండా వజ్రా వెహికల్స్, నేత్ర వంటి అత్యాధునిక వ్యవస్థలతో గస్తీ ఉంటుందని తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

పెన్నానదిలో చిక్కుకున్న భక్తులు

- రక్షించిన భూపేశ్‌రెడ్డి, పోలీసులు



భక్తులను కాపాడిన భూపేశ్‌రెడ్డి, ఫైర్, పోలీసులు

జమ్మలమడుగు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దానవులపాడు, సున్నపురాళ్లపల్లె గ్రామాల మధ్య పెన్నానదిలో ముగ్గురు భక్తులు చిక్కుకున్న సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. ప్రొద్దుటూరు శ్రీ రాజరాజేశ్వరి అపార్టుమెంట్ 305 నంబరులో నివాసం ఉంటున్న గోవర్దన్‌రెడ్డి (39), ఓబులమ్మ (60), రామలక్షుమ్మ (80) అనే ముగ్గురు భక్తులు పౌర్ణమిని పురష్కరించుకుని రాత్రి కన్యతీర్థం శ్రీబాల త్రిపురసుందరీదేవి, సుందరేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం తిరుగు ప్రయాణం ఆదివారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కారులో బయల్దేరారు. సున్నపురాళ్లపల్లె వద్ద నుంచి పెన్నానదిలో దానవులపాడు అక్కడి నుంచి ప్రొద్దుటూరుకు వెళ్లాలని అనుకున్నారు. కాగా మైలవరం జలాశయం నుంచి శనివారం పెన్నానదికి 10 వేల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేశారు. అందులో భాగంగా దానవులపాడు-సున్నపురాళ్లపల్లె గ్రామాల మధ్య పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ ముగ్గురు భక్తులు కారులో చిక్కుకున్నారు. దిక్కుతోచని స్థితిలో భక్తులు లబోదిబోమంటూ బోరున విలపించడంతో అక్కడున్న స్థానికులు వెంటనే అప్రమత్తమై జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఆయనతో పాటు దానవులపాడు వద్ద ఉన్న ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చదిపిరాళ్ల రమేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, మరికొందరు స్థానికులు వెంటనే పెన్నానది వద్దకు వచ్చారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అనంతరం మైలవరం జలాశయంలో వరద నీరు విడుదల తగ్గించాలని భూపేశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జమ్మలమడుగు అర్బన్ పోలీసుస్టేషన్‌కు విషయం తెలియజేశారు. ఆ వెంటనే ఫైర్ సిబ్బంది స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తెప్పలతో భక్తులను ఒడ్డుకు చేర్చి ప్రాణాలను కాపాడారు. కాగా తమను రక్షించినందుకు భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, గ్రామస్థులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



వరద ఉధృతిలో చిక్కుకున్న వారిని తెప్పసాయంతో బయటకు తెస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన పవన్‌కుమార్

మైదుకూరు రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రక్షాబంధన్ సందర్భంగా ఫ్రెండ్ చెల్లెలితో రాఖీ కట్టించుకోవాలని వెళ్లాడు.. తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి మైదుకూరు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. యర్రగుంట్ల టౌన్‌లో నివసిస్తున్న దేరంగుల పవన్‌కుమార్ (23) వైరింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడని, శనివారం రక్షాబంధన్ అయినందున తన ఫ్రెండ్ నాగరాజు నాయక్ చెల్లెలితో రాఖీ కట్టించుకొనేందుకు స్నేహితులిద్దరూ బైక్‌పై బద్వేల్‌కు వెళ్లారన్నారు. అక్కడ ఆమెతో రాఖీ కట్టించుకొని తిరిగి వస్తుండగా మండలంలోని బసవాపురం సమీపంలో రాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. తీవ్రగాయాలతో ఉన్న ఇరువురిని స్థానికులు 108 వాహనంలో మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే పవన్‌కుమార్ మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని, నాగరాజు నాయక్‌ను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, ఈ మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుబ్బయ్య తెలిపారు.

ట్రాక్టరుకింద పడి యువకుడి మృతి


మృతి చెందిన సుదర్శన్ ఫైల్‌ఫొటో

కడప క్రైం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కడప నగరం బిల్డప్ సర్కిల్ వద్ద ప్రమాదవశాత్తు యువకుడు ట్రాక్టరుకింద పడి మృతి చెందినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఆ వివరాల మేరకు.. చెన్నూరు మండలం కొక్కిరాయపల్లె గ్రామానికి చెందిన దొరబోయిన సుదర్శన్ (21) ఐటీఐ చదువుకుంటున్నాడు. అన్న కడప కార్పొరేషన్‌కు సంబంధించి చెత్త సేకరించేందుకు ట్రాక్టరును బాడుగకు ఇచ్చాడు. అయితే ఆదివారం కావడంతో సుదర్శన్ కూడా ఖాళీగా ఉండలేక ట్రాక్టరుతో పాటు వచ్చాడని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వినాయక్‌నగర్ సమీపంలోకి రాగానే గేదె అడ్డురావడంతో ట్రాక్టర్‌కు సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రాక్టరులో ఉన్న సుదర్శన్ పట్టు తప్పి అదే ట్రాక్టరు కింద పడిపోవడంతో మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి...

కమలాపురం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోపులాపురం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రైలుకింద పడి కామనూరు నాగరాజు (35) మృతి చెందినట్లు గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. కమలాపురం మండలం సి.రాజుపాలెం గ్రామానికి చెందిన నాగరాజు పశువులు మేపుతూ జీవనం సాగించేవాడు. మూడు సంవత్సరాల క్రితం తన భార్య టీబీ జబ్బు వల్ల చనిపోయింది. శనివారం పశువులు మేతకు వెళ్లి కనిపించలేదని, పాచికలపాడు సమీపంలో ఉన్నట్లు తెలుసుకుని వాటిని తోలుకుని వచ్చేందుకు నాగరాజు వెళ్లాడన్నారు. అయితే ఏం జరిగిందో ఏమో తెలియదు కానీ గోపులాపురం సమీపంలో రైలు పట్టాలపై శవంగా కనిపించాడని రోదించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె కలరు. చిన్నారుల తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో అనాథలుగా మిగిలారని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడికి గాయాలు

మైదుకూరు రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): చాపాడు మండలం సిద్దారెడ్డిపల్లెకు చెందిన యువకుడు జి.నాగభూషణం తన తల్లితో కలిసి మోటర్‌సైకిల్‌పై వస్తూ ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం వ్యక్తిగత పని మీద మైదుకూరుకు వచ్చి తిరిగి సిద్దారెడ్డిపల్లెకు వెళ్తుండగా ప్రొద్దుటూరులోని పశువైద్యశాల వద్ద ఆగి ఉన్న ఇన్నోవా వాహనాన్ని ఢీకొట్టారు. గాయపడినవారిని స్థానికులు 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విషద్రావణం తాగి మహిళ ఆత్మహత్యా యత్నం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో కలత చెంది మహిళ విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం మదనపల్లె పట్టణంలో చోటుచేసుకుంది. బాధితరాలు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం అనపగుట్టకు చెందిన సంధ్య(35) టైలర్‌గా, తన భర్త శ్రీనివాసులు ఎలక్ట్రీషన్‌గా పని చేస్తూ జీవనం సాగించేవారని, శనివారం రాత్రి ఇరువురు ఘర్షణ పడ్డారని తెలిపారు. దీంతో మనస్థాపం చెందిన సంధ్య ఆదివారం ఉదయం విషద్రావణం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

పోరుమామిళ్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన కలసపాడు మండలంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడిని ఆదివారం పోరుమామిళ్ల మండలం మార్కాపురం వద్ద అరెస్టు చేసి కోర్టుకు పంపుతున్నట్లు తెలిపారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడం అత్యంత బాధాకరమన్నారు. తల్లిదండ్రులు చిన్న పిల్లలకు సెల్‌ఫోన్లు దూరంగా ఉంచాలని, సెల్‌ఫోన్లలో వచ్చే అశ్లీల సన్నివేశాలకు చాలామంది ప్రభావితులై ఇలాంటి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐలు కొండారెడ్డి, తిమోతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ : ఆస్తి నష్టం

వల్లూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలో శనివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో రూ.50వేల విలువ చేసే ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయినట్లు యజమాని నాగేంద్ర తెలిపారు. బాధితుడి వివరాల మేరకు.. శనివారం రాత్రి ఇంటి ఆవరణంలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో శబ్ధాలు రావడంతో ఇంటి తలుపులు తీశామని, విద్యుత్ షార్టుసర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న ఫ్రిజ్, ఫ్యాను తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయని వాపోయారు. అలాగే ఇంటి పైకప్పు, ఇళ్లంతా నెర్రలు బారాయని, మంట లు వ్యాపించడం వల్ల నలుపు ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


కాలిపోయిన ఫ్రిడ్జ్

బిల్లులు లేకుండా ఎరువులు అమ్మితే చర్యలు

ములకలచెరువు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బిల్లులు లేకుండా ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో స్రవంతి హెచ్చరించారు. మండంలోని వేపూరికోటలో ఆదివారం జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా జీఎస్టీ బిల్లు ఇవ్వాలన్నారు. ప్రతి దుకాణం ముందు తప్పనిసరిగా స్టాక్‌బోర్డు ఇవ్వాలన్నారు. కాలం చెల్లిన మందులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

14న పులివెందుల ప్రజలకు స్వాతంత్ర్యం

స్వేచ్ఛాయుత వాతావరణంలో పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక : బీటెక్ రవి



పులివెందుల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నిక ఫలితాలు ఈనెల 14వ తేదీ వెలువడతాయని, దీంతో ఇండిపెండెన్స్‌డేకు ఒకరోజు ముందే పులివెందుల ప్రజలకు స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. పులివెందుల నియోజకవర్గంలో ఏడు మండలాలకు గాను పులివెందుల మండలానికి సంబంధించి జడ్పీటీసీ ఉప ఎన్నిక జరుగుతోందన్నారు. ఇది చాలా చిన్న ఎన్నిక అని, గెలుపుపై తమ పార్టీ పూర్తిగా దృష్టి సారించిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు. ప్రచారానికి వెళ్లిన సమయంలో పులివెందుల ప్రజలు ఈ ఎన్నికలు గౌరవాన్ని తెచ్చిపెట్టాయని అంటున్నారన్నారు. గతంలో ఆయా పంచాయతీల్లోని ఒకరిద్దరు నాయకులు వెళ్లి వైఎస్ కుటుంబం వద్ద మెప్పుపొందేవారని, కానీ ఈ ఎన్నికలు రావడంతో గతంలో మాదిరి కాకుండా ప్రతి ఒక్కరి అభిప్రాయాలను గుర్తిస్తామని చెబుతున్నారన్నారు. ముఖ్యంగా వైసీపీ సాక్షి విలేకరులను, వాహనాలను తిప్పుతున్నారని, రాష్ట్రంలో ఉన్న వాహనాలన్నీ పులివెందులలోని గ్రామగ్రామానికి తెచ్చారన్నారు. గ్రామాల్లో వారంతట వారే అలజడి సృష్టించి లేనిపోని విధ్వంసాలకు దిగుతారని అనుమానంగా ఉందని, ఈ నేపథ్యంలో పోలీసులు కూడా పూర్తిస్థాయిలో భద్రత ఏర్పాటు చేస్తున్నారని, పులివెందులలో జరగబోయే జడ్పీటీసీ ఉపఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో సాగుతాయని బీటెక్ రవి తెలిపారు.

పులివెందుల ఎవరి అడ్డా కాదు..: ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి




పులివెందుల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పులివెందుల ఎవరి అడ్డా కాదని, ఎవరి కంచుకోట కాదని, ఇందిరాగాంధీ లాంటి మహా నాయకురాలినే ఓడించిన ఘనత ఈ ప్రజలకు ఉందన్నారు. అటువంటి ఓటర్లకు ఎవరిని గెలిపించాలో బాగా తెలుసునని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. పులివెందుల ప్రాంతంలో జరిగిన అనేక ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేశామని, అందులో భాగంగానే ఇప్పుడు జరగబోయే ఎన్నికల్లో కూడా టీడీపీ బరిలో దిగిందన్నారు. కానీ అప్పటికీ, ఇప్పటికీ చాలా వ్యత్యాసాలు ఉన్నాయన్నారు. గతంలో దౌర్జన్యాలు, దుర్మార్గాలు, కక్షసాధింపులతో ఎన్నికలు జరిగేవని, కానీ ఈ ఎన్నికలు పూర్తిగా స్వేచ్ఛాయుత వాతావరణంలో సాగబోతున్నాయన్నారు. హత్యా రాజకీయాలను ఈ ప్రాంతంలో వైసీపీ పెంచి పోషించిందన్నారు. పులివెందుల వైఎస్ కుటుంబం అడ్డా అని అనుకోవాల్సిన అవసరం లేదన్నారు. పులివెందులలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికలు నాలుగు దశాబ్దాల తర్వాత స్వేచ్ఛాయుత వాతావరణంలో సాగుతున్నాయన్నారు.

ప్రశాంత ఎన్నికలను అడ్డుకునేందుకు వైసీపీ ప్రయత్నం : ఎమ్మెల్యే ఆది


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

పులివెందుల రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో 2021లో జడ్పీటీసీ ఎన్నికలు జరిగితే టీడీపీ, బీజేపీ నాయకులు నామినేషన్ వేయకుండా వైసీపీ దౌర్జన్యం చేసిందని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ధ్వజమెత్తారు. అయితే ప్రస్తుతం జడ్పీటీసీ ఎన్నికలకు 11 నామినేషన్లు వచ్చాయని, ఇదే క్రమంలోనే ఎన్నికలు కూడా జరగబోతున్నాయన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గట్టెక్కిస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ సహకారంతో నిధులు తేవడంతో పాటు పరిశ్రమలు వచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఎన్నడూ లేని విధంగా పులివెందులలో ప్రశాంతంగా ఎన్నికలు జరుతున్నాయని, ఈ ప్రశాంతతను చూసి వైసీపీ ఓర్వలేక వారిపై వారే దాడులు చేసుకొని తమపై నిందలు మోపి ఇక్కడ ఏదో జరగబోతోందని ప్రశాంత ఎన్నికలను అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. సొంత చెల్లెళ్లను పట్టించుకోని జగన్ తనను గెలిపించిన పులివెందుల ప్రజలను ఏం పట్టించుకుంటాడని, ప్రజలు ప్రతి విషయాన్ని గుర్తుపెట్టుకుంటారని, గతంలో చేసిన అరాచకాల కారణంగానే ప్రజలు 151 నుంచి 11సీట్లలో కూర్చోబెట్టారన్నారు. ఇక్కడి సమస్యలను, చేయాల్సిన అభివృద్ధి పనులను వంద రోజుల్లోనే పూర్తిచేసేలా సత్వర చర్యలు తీసుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ప్రజల సహకారం ఉందని, పులివెందులలో తప్పకుండా జెండా పాతుతామన్నారు. కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ వంగల శశిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంసాగర్‌కు 6 టీఎంసీల నీరు


బ్రహ్మంసాగర్ ఎడమ కాల్వ నుండి దిగువకు వెళుతున్న నీరు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బ్రహ్మంసాగర్ ప్రాజెక్టుకు 6 టీఎంసీల నీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నాగేశ్వర్‌రావు తెలిపారు. వెలుగోడు ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో 1400 క్యూసెక్కులు ప్రాజెక్టులోకి రాగా కుడి, ఎడమ కాలువ, థర్మల్ ప్రాజెక్టుకు 380 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఏఈ తెలిపారు. పై నుంచి బ్రహ్మంసాగర్‌కు నీరు చేరేలోపల నీటిని రైతన్నలు పొదుపుగా వాడుకోవాలని ఆయన తెలిపారు. కాగా ఎడమ కాల్వకు రైతుల అభ్యర్థన మేరకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదేశాలతో శనివారం బ్రహ్మంసాగర్ నుంచి తెలుగుగంగ అధికారులు, టీడీపీ నేతలు నీటిని దిగువకు వదిలారు.

పోలీస్‌స్టేషన్ ముట్టడి

- బాలిక కిడ్నాప్ కేసులో న్యాయం చేయలేదని బాధితుల ఆవేదన

రామసముద్రం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం చేశారని ఆరోపిస్తూ బాధిత కుటుంబాల సభ్యులు ఆదివారం పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించి నిరసన వ్యక్తం చేశారు. ఓ మైనర్ బాలికను బి.కొత్తకోట కు చెందిన యువకుడు గత ఎనిమిదో తేదీ రాత్రి ఇంటి తాళం పగులగొట్టి బాలికను కిడ్నాప్ చేసి బలవంతంగా పెళ్లి చేసుకున్నాడని, అంతేకాకుండా ఇంటిలోని బీరువాలో ఉన్న బంగారు నగలు ఎత్తుకెళ్లాడని బాధితులు అంటున్నారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని, అయితే నిందితుడిని పట్టుకోవడం లో పోలీసులు నిర్లక్ష్యం చూపడంతో తామే నిందితుడిని అచూకీ కనుక్కొని ఆదివారం బాలికతో పాటు నిందితుడిని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఇంటి నుండి ఎత్తుకెళ్లిన బంగారు నగలు, డబ్బు నిందితుడి నుండి రాబట్టి అతనిపై కేసు నమోదు చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈ మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోప్ స్కిప్పింగ్ జిల్లా జట్టు ఎంపిక

మదనపల్లె టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా జట్టును ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రోప్ స్కిప్పింగ్ క్రీడాకారుల నైపుణ్యం పరీక్షించి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కరుణాకర్, లత, శరత్ మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి, ఈనెల 30వ తేదీన కర్నూల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు. అక్కడ గెలుపొందిన జిల్లా జట్టు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీలకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో జ్ఞానాంబిక కళాశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర, క్రీడాకారులు పాల్గొన్నారు.


జిల్లా జట్టుకు ఎంపికైన రోప్ స్కిప్పింగ్ క్రీడాకారులు

గొర్రెల కాపరిపై ఎలుగుబంటి దాడి


గాయపడిన నాగరాజు

పోరుమామిళ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గొర్రెలను మేపుకు నేందుకు కొండపైకి వెళ్లిన కాపరిని పిల్లల తల్లి అయిన ఎలుగబంటి దాడి చేయడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. పోరుమామిళ్ల మండలంలోని ఎరసాల గ్రామానికి చెందిన బాయకట్టు నాగరాజు ఆదివారం గొర్రెల మేపునకు కొండకు వెళ్లాడు. అక్కడ మేపుతుండగా ఒక్కసారిగా పిల్లల తల్లి ఎలుగుబంటి దాడి చేయడంతో భయంతో ఆ గొర్రెలకాపరి కేకలు వేశాడు. అక్కడే ఉన్న కొందరు గొర్రెల కాపరులు సంఘటనాస్థలానికి చేరడంతో అవి పరారీ అయ్యాయి. నాగరాజు ముఖానికి, చేతులకు పెద్ద గాయాలు కావడంతో పోరుమామిళ్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కడపకు తరలించారు.

బంగారు నగల దుకాణంలో చోరీ

- రూ.15లక్షలు విలువ చేసే బంగారు, వెండి నగలు అపహరణ
- నగల బ్యాగుతో ఇద్దరు దొంగలు పరారీ

బద్వేలుటౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బద్వేలు మున్సిపాలిటీలో వరుస చోరీలతో పట్టణ ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఆదమరచి ఉన్నామంటే చాలు చుట్టుపక్కల ఎందరు ఉన్నా.. ఎన్ని సీసీ కెమెరాలు వారి వైపే చూస్తున్నా.. దొంగల్లో అసలు బెరుకు అనేదే లేకుండా స్కెచ్‌వేసి, రెక్కీచేసి కొట్టాల్సిన టార్గెట్‌ను కనురెప్పపాటలో కొట్టుకుపోతున్నారు. దీనికి నిదర్శనం బద్వేలులో శనివారం రాత్రి జరిగిన బంగారు దుకాణంలో చోరీ ఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. ఆ వివరాల్లోకి వెళితే... పట్టణంలోని సిద్దవటం రోడ్ మసీద్ కాంప్లెక్స్‌లో ఉన్న జేబీ బంగారు దుకాణాన్ని మూతవేస్తూ శనివారం రాత్రి దుకాణంలోని నగలన్నింటినీ ఒక బ్యాగులో పెట్టుకొని ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండగా దుకాణ యజమాని ఒక పని నిమిత్తం బయటకు వెళ్లాడు. గమనించిన దొంగ ఆ దుకాణంలోకి దూరి నగల బ్యాగును పట్టుకొని ఉడాయించాడు. పక్కనే ఉన్న దుకాణదారుడు ఆ షాపుయజమానికి ఫోన్ చేయగా వచ్చి చూసేలోపే అంతా జరిగిపోయింది. అందులో 74గ్రాముల బంగారు నగలు, 7 కేజీల వెండి సామగ్రి ఉన్నాయని షాపు యజమాని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఆ దొంగకోసం నిఘాపెట్టిన ప్రయోజనం లేకుండా పోయింది. ఆదివారం ఉదయం క్లూస్‌టీం వచ్చి పరిశీలించారు. త్వరలోనే దొంగను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

రాణిస్తున్న మహిళా సబ్‌కలెక్టర్లు


సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టనున్న చల్లా కల్యాణి

మదనపల్లె టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా పేరొందిన మదనపల్లెలో సబ్‌కలెక్టర్లుగా మహిళలు రాణిస్తున్నారు. ఎనిమిదేళ్లలో ఎక్కువగా మహిళా సబ్‌కలెక్టర్లే పాలన సాగించారంటే అతిశయోక్తి కాదు. మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన మహిళల్లో కృతికశుక్లా, వెట్రిసెల్వి, మేడిద జాహ్నవి, కీర్తి చేకూరి వున్నారు. వీరి తరువాత వైసీపీ పాలనలో మూడేళ్లుగా ఆర్డీవో మురళి, హరిప్రసాద్ పనిచేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక మేఘస్వరూప్ సబ్‌కలెక్టర్‌గా ఏడాది పనిచేశారు. తాజాగా చల్లా కల్యాణి సబ్‌కలెక్టర్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

అభివృద్ధికి ఓటు వేసేందుకు ప్రజలు సిద్ధం : మంత్రి


పులివెందుల మండలం నల్లగొండవారిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి

పులివెందుల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగే అభివృద్ధి, సంక్షేమానికి ఓటు వేసేందుకు పులివెందుల ప్రజలు సిద్ధంగా ఉన్నారని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సవిత అన్నారు. ఆదివారం మండలంలోని రాయలాపురం గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు కరపత్రాలు అందించి పింఛన్లు, తల్లికివందనం పథకాలు అందాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రోడ్లు బాగుచేయించాలని ప్రజలు అడుగగా ఈ గ్రామానికి రూ.40లక్షలు మంజూరైందని, ఆ నిధులతో రోడ్లు పూర్తిచేయిస్తామని మంత్రి తెలిపారు. జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని, కూటమి ప్రభుత్వ పాలన పట్ల సంతోషంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం ఉన్నప్పుడు, లేనప్పుడూ వైసీపీ దౌర్జన్యాలు ఆగడం లేదని ప్రజలే అంటున్నారన్నారు.

గ్రామాల్లో ప్రచార హోరు

పులివెందుల మండలంలోని ఇ.కొత్తపల్లె గ్రామంలో మంత్రి పార్థసారధి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నల్లగొండవారిపల్లెలో జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి, అలాగే అచ్చవెల్లి గ్రామంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

హవ్వా.. ఓటుకు రూ.10వేలా..!


- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న కూటమి, వైసీపీ
- తులసిరెడ్డి ఆశ్చర్యం

వేంపల్లె, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యాన్ని వైసీపీ, కూటమి పార్టీలు అపహాస్యం చేస్తున్నాయని, పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రెండు పార్టీలు ప్రయత్నించడం దురదృష్టకరమని, ఓటుకు రూ.10వేలు పలుకుతుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మొన్నటి వరకు వైసీపీ దౌర్జన్యాలకు దిగిందని, నామినేషన్ వేయకుండా అడ్డుకుందని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ వీరవిహారం చేశారన్నారు. ప్రస్తుతం జిల్లాలో జరుగుతున్న పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలో ధనస్వామ్యంగా జరుగుతోందన్నారు. 9 నెలల కాలంమాత్రమే ఉన్న ఎలాంటిఅధికారాలు లేని జడ్పీటీసీకి ఇంతలా దిగజారుతారా అంటూ ప్రశ్నించారు. ఎన్నికలు ఎందుకు.. వేలంపాట గాని, లాటరీపద్ధతిలో నిర్వహిస్తే సరిపోతుంది కదా అన్నారు. ఇటు ప్రతిపక్ష వైసీపీ, కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే ఎన్నికల కమిషన్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం శోచనీయమని, ఈ పరిణామం ప్రజాస్వామ్యంలో సిగ్గుచేటని తులసిరెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.2.29లక్షల విరాళం


విరాళం అందిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన కర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మనవరాలు జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి ప్రకాశం జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి కుందుర్తి సీతారామాంజనేయులు, కోశాధికారి రాచర్ల రాజశేఖర్, కమిటీ సభ్యులు రూ.2.29లక్షల విరాళాన్ని అందించారు. ఆదివారం వారు ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి వీరశివకుమారస్వామికి ఈ నగదును అందించినట్లు మఠం కార్యనిర్వాహణాధికారి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మఠాధిపతి మాట్లాడుతూ విరాళం ఇచ్చిన దాతలకు ఈశ్వరీదేవి మాత దివ్యానుగ్రహం ఎల్లవేళలా ఉండాలని ఆయన ప్రార్థించారు.



కావలెను

కడప నగరంలో ప్రముఖ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు 8th నుండి 10th వరకు ఇంగ్లీష్ (35k to 40k), 8th to 10th Maths (35k to 40k), 6th to 9th I.I.T. Foundation, Chemistry (30k to 35k), Computer Class Teacher(18k to 20k) బోధించుటకు అర్హత అనుభవంకలిగిన ఉపాధ్యాయులు కావలెను. Contact : 92926 07689, 9059119922 Aje-233236

అర్జంటుగా కావలెను

APSRTCలో TV బాయ్స్ కొరకు ఇంటర్, డిగ్రీ చదివిన సూపర్‌వైజర్స్ కావలెను. కడప లోకల్ వారికి ప్రాధాన్యత. TSRTC, కడప నందు కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. సెల్ : 9133117715 Aje-233182

వంటమాస్టర్ కావలెను

కడపలో ప్రముఖ ఏంజెల్స్ లేడీస్ హాస్టల్ నందు వంట మాస్టర్స్ కావలెను. కడప లోకల్ వారికి ప్రాధాన్యత. సెల్ : 9133117715 Aje-233183

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిప్పింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647. AJA- 237943

ఆంధ్రజ్యోతిలో ప్రకటనల కోసం సంప్రదించండి

యూనిట్ కార్యాలయం 9985411183 9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మరణాల్లో కూడా కులం చూసే వ్యక్తి జగన్

సతీశ్‌రెడ్డి ఫోన్ రికార్డులు ఎవరికి చేరాలో వారికి చేరాయి ● ఆయనపై దాడి చేయాల్సిన అవసరం మాకు లేదు

పులివెందులలో పసుపు జెండా రెపరెపలాడబోతోంది : ఎమ్మెస్ రాజు

పులివెందుల రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సొంత పార్టీలో ఎవరైనా ప్రజాప్రతినిధులు మరణిస్తే ఆ మరణాల్లో కూడా కులం చూసే వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. ఆదివారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉండగా ఎంతో మంది దళితులపై దాడులు జరిగాయన్నారు. అధికారంలో ఉండగా ఎమ్మెల్సీ అనంత బాబు తన డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసి కంప్లైంట్ ఇస్తే రెండో కొడుకును కూడా చంపుతామని బెదిరించిన పరిస్థితి అందరికీ తెలిసిందే అన్నారు. చిత్తూరు జిల్లాలో లిక్కర్ రేట్లపై ప్రశ్నించిన ఓంప్రకాష్ అనే వ్యక్తి ఉదయానికి శవమై తేలాడన్నారు. పులివెందుల నియోజకవర్గంలో నాగమ్మ అనే మహిళను అత్యాచారం చేసి చంపితే అది ప్రశ్నించిన నాపై, ప్రస్తుత హోం మంత్రిపై కేసులు పెట్టించారన్నారు. వైసీపీ హయాంలో తిరుపతి వైసీపీ ఎంపీ దుర్గాప్రసాద్ మరణిస్తే కనీసం ఆయన కుటుంబాన్ని పరామర్శించిన దాఖలాలు లేవన్నారు. నా ఎస్సీలు,నా ఎస్టీలు అని మాట్లాడే జగన్‌రెడ్డి దళితుల పట్ల ఏమాత్రం ప్రేమ ఉందో ఈ సంఘటనలే ఉదాహరణలు అన్నారు. అధికారం కోల్పోయినా కూడా దళితులపై వైసీపీ ఆగడాలు మానుకోలేదన్నారు. తిరుపతిలో భూమన కరుణాకర్‌రెడ్డి నివాసంలో ఆయన కుమారుడు అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో వారి అనుచరులు అనిల్‌రెడ్డి, దినేష్‌రెడ్డి పవన్ అనే దళిత యువకుడిని కిడ్నాప్ చేసి బంధించి, లాఠీతో కొట్టి హింసించి వీడియో చిత్రీకరించారన్నారు. దీనిని యావత్ ప్రపంచం చూసిందన్నారు. దళితులపై దాడులు చేసిన వైసీపీ నాయకులను మందలించడం గాని, పార్టీ నుంచి సస్పెండ్ చేయడం గాని లాంటివి చేయకుండా వారికి మరిన్ని ఉన్నత పదవులు ఇచ్చి జగన్ ప్రోత్సహిస్తున్నారన్నారు. దళిత సమాజం అంటే జగన్‌కు చులకనభావం అన్నారు. అలాగే పులివెందులలో జరుగుతున్న జడ్పీటీసీ ఉప ఎన్నికలలో హింసాత్మక ఘటనలు చోటు చేసుకునేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రతి గ్రామంలో బయటి నుంచి తన మనుషులను కూర్చోబెట్టి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దీనిని ఎదుర్కొనేందుకు కూటమి నాయకులు సిద్ధంగా ఉన్నారన్నారు. అలాగే వివేకా హత్య కేసులో అవినాష్‌రెడ్డి జైలుకు వెళితే ఎంపీగా నాకే అవకాశం వస్తుందని పులివెందుల పులికేశి సతీశ్‌రెడ్డి అనుకున్నారన్నారు. అలాగే లిక్కర్ కేసులో జగన్‌మోహన్‌రెడ్డి జైలుకు వెళితే పులివెందుల ఎమ్మెల్యేగా నాకే అవకాశం వస్తుందని సతీశ్‌రెడ్డి అనుకున్నారన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే విషయాలపై ఆయన మాట్లాడిన మాటలు ఫోన్ రికార్డులు ఎవరికి చేరాయో వారికే చేరాయన్నారు. దీనితో సతీష్‌రెడ్డి తనను ఏదైనా చేస్తారని భయపడి కూటమి నాయకులు నాపై దాడులు చేస్తారని మాట్లాడుతున్నారన్నారు.

నేడు లోకేష్ నన్ను టార్గెట్ చేశారని, దాడి చేస్తారని మాట్లాడుతున్నారన్నారు. ఆ సినిమా డైలాగులు ఏమయ్యాయో చెప్పాలన్నారు. ఆయన మాట్లాడిన ఫోన్ రికార్డులు ఎవరికి చేరాయో, నీపై దాడి చేస్తే వారే చేస్తారన్నారు. నీపై దాడి చేయాల్సిన అవసరం, సమయం లోకేష్‌కు గాని, మాకు గానీ లేదన్నారు. పులివెందులలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు జరుగుతున్నాయని, ఇక్కడ ఏదో జరుగుతోందని ప్రజలకు చెప్పే ప్రయత్నం చేస్తూ వైసీపీ నాయకులే అభాసుపాలవుతున్నారన్నారు. సంక్షేమం- అభివృద్ధిని చూసి టీడీపీని గెలిపించి మరింత అభివృద్ధి జరిగేందుకు పులివెందుల ప్రజలు సిద్ధంగా ఉన్నార న్నా రు. జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో మారెడ్డి లతారెడ్డి అత్యధిక మెజార్టీతో గెలుపొంది టీడీపీ జెండా రెపరెపలాడబోతోందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను దిగ్విజయం చేయండి

కడప మారుతీనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదిన సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక కుప్పం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నగర అక్కాయపల్లెలోని (తిలక్‌నగర్) ఈ నెల 16 నుంచి 20 వరకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా జరగనున్నట్లు ఆ సమితి కడప కమిటీ అధ్యక్షుడు నవనీశ్వర్‌రెడ్డి, సభ్యులు ఈశ్వర్, పి.సదానందుడు, రామనాథం, ఆర్వీ పెరుమాళ్, ఎస్.మణి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం కడప తాలుకా సీఐని కలిసి ఆహ్వాన పత్రిక అందించి కరపత్రాలను ఆవిష్కరింపజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు సమితి సభ్యులు పాల్గొన్నారు.

పొలతల ఆలయ పాలక మండలికి దరఖాస్తుల ఆహ్వానం

పెండ్లిమర్రి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రమైన పొలతల మల్లేశ్వరస్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి కృష్ణానాయక్ తెలిపారు.ఈ నెల 7వ తేదీన దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని,అప్పటి నుంచి 20 రోజుల లోపు ఆసక్తి ఉన్న వారు తమ దరఖాస్తులను జిల్లా దేవదాయ శాఖ అధికారి,కడప కార్యాలయానికి పంపాలన్నారు.

గంగమ్మకు పూజలు

సీకేదిన్నె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చింత కొమ్మదిన్నె గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకుని ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం బంధు మిత్రులతో కలిసి విందు భోజనాలు ఏర్పాటు చేసుకున్నారు.

ఓబన్న నిత్యాన్నదానసత్రంగా నామకరణం చేయాలి

కడప స్పోర్ట్స్ ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవస్థాన పరిధిలో నూతనంగా నిర్మించే నిత్యాన్నదాన సత్రానికి పరమ రామభక్తుడిగా ఖ్యాతి గాంచిన మాల ఓబన్న పేరు వచ్చేలా ఓబన్న నిత్యాన్నదాన సత్రం అనే నామకరణం చే యాలని ఎస్సీఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాయలసీమ ఇన్‌చార్జ్ చాగలమర్రి ఓబులయ్య కోరారు. ఆ మేరకు ఆదివారం అన్నమయ్య జిల్లా పర్యటన నిమిత్తం రాయచోటికి విచ్చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ ఎన్ మాధవ్ ను అక్కడి స్టేట్ గెస్ట్‌హౌస్‌లో కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కడప జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పాలెం సురేశ్‌కుమార్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనాథరెడ్డి తదితరులుపాల్గొన్నారు.

వైసీపీ సీనియర్ నేత టీడీపీలో చేరిక



టీడీపీలో చేరుతున్న విజయకుమార్

కడప క్రైం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సీనియర్ నేత పెనుబాల విజయ కుమార్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి మండిపల్లి రాం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో తన అనుచరులతో కలిసి కడపలో పెనుబాల విజయకుమార్ ఆదివారం టీడీపీ కండువా ధరించారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో ఎస్సీఎస్టీ సెల్ అధ్యక్షుడుగా పనిచేశారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయడంతో ఆ పార్టీలోకి వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు పెనుబాల విజయకుమార్ తెలిపారు.

శ్మశానానికి దారి చూపండి

వల్లూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని పెద్దలేబాక, హరిజనవాడకు చెందిన గ్రామస్థులు తమ శ్మశానంలోకి పోయేందుకు దారి చూపాలని వేడుకుంటున్నారు. ఆదివారం హరిజనవాడకు చెందిన వారందరూ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమ కాలనీవాసులకు శ్మశాన వాటిక లేక గతంలో ఇబ్బందులు పడుతున్నామని ప్రభుత్వం చొరవ తీసుకుని ఏర్పాటు చేసిందన్నారు. వెంటనే ప్రభుత్వం తీసుకుని శ్మశాన వాటికకు దారి చూపాలని కోరారు.

బహిరంగ ప్రకటన

ICICI Bank నమోదిత కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చక్లీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007 కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ (ICICI బ్యాంక్) నుండి పొందిన (సౌకర్యం) తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను ఆగస్టు 21, 2025న ఇ-వేలం వేయడానికి మాకు తప్పనిసరి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి ఇ-వేలం తేదీని మార్పు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం -https://gold.samil.in ఆన్‌లైన్లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. [illegible]

రుణ ఖాతా నెం.	రుణగ్రహీత పేరు	రుణ ఖాతా నెం.	రుణగ్రహీత పేరు	రుణ ఖాతా నెం.	రుణగ్రహీత పేరు
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]
027962016221	లగుసాని సతీష్ కుమార్	130562006929	కరమొళ్ల విజయ	221362001627	అరిగెల లింగమూర్తి
శాఖ పేరు: కర్నూలు- సి క్యాంపు		130562007848	కట్టపాడి బాబాఫక్రుద్దీన్	శాఖ పేరు: వనపర్తి	
756757000062	రంజిత్ కుమార్ బి	శాఖ పేరు: తిరుపతి		131162024361	చిట్టిరాజులు పరమేశ్
శాఖ పేరు: కర్నూలు తిలక్ నగర్		630962039926	బి రషీద్		

తేది:11.08.2025

ప్రదేశం : అనంతపురము, అనకాపల్లి, అన్నమయ్య, బాపట్ల, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, గుంటూరు, కాకినాడ, తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, కర్నూలు, నంద్యాల, ఎన్టీఆర్, పల్నాడు, పార్వతీపురం మన్యం, విజయనగరం, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, శ్రీ సత్యసాయి, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, పశ్చిమగోదావరి, వై.యస్.ఆర్, చిత్తూరు, ఆంధ్రప్రదేశ్, జగిత్యాల, కరీంనగర్, మెదక్, నిర్మల్, రంగారెడ్డి, వనపర్తి, వరంగల్, తాండూరు (ఆర్‌ఆర్ జిల్లా)

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

టీడీపీ బలోపేతానికి సంస్థాగత ఎన్నికలు కీలకం

కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు మనోహర్‌నాయుడు

చెన్నూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): టీడీ పీకి కార్యకర్తలు మూలస్తంభాలైతే సంస్థాగత ఎన్నికలతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు మనోహర్‌నాయుడు అన్నారు. మండలంలో సంస్థాగత ఎన్నికలు ఆదివారం నాటికి పూర్తికావడంతో వాటి పరిశీలనకు ఆయన రావడం జరిగింది. అలాగే మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డితో పాటు మండలంలోని వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులుతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ మరింత బలోపేతం కావడమే కాక గ్రామ గ్రామాన అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ కచ్చితంగా గెలిచి తీరుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ ఫక్రుద్దీన్‌బాబా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, మాజీ జడ్పీటీసీ చిన్నయ్య, అతికారి విశ్వం, వేల్పుల సుబ్రహ్మణ్యం, కొండపేట సుధాకర్‌రెడ్డి, షబ్బీర్‌హుసేన్, గౌస్‌పీర్, మురళి, సుదర్శనరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలి

అభ్యుదయ వేదిక అధ్యక్షుడు కె.సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలని అఖిలభారత అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌బాబు తెలిపారు. ఆదివారం కడప నగరం ఎస్టీయూ భవన్‌లో అఖిలభారత అభ్యుదయ వేదిక జిల్లా శాఖ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఎన్నికల కమిషన నిష్పాక్షితకు సంబంధించి పలు విమర్శలు వస్తున్నాయని, వీటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌దేనన్నారు. అన్ని రాజకీయ పార్టీలను సమానమైన దృష్టితో చూడాల్సిన బాధ్యత ఈసీపైన ఉందని అన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పనితీరుపైన వస్తున్న విమర్శలను బాగా పరిశీలించి అనుమానాలను నివృత్తి చేయాలని, ప్రతి ఓటరును వారి ఆధార్‌తో లింకు చేయాలని సురేష్‌బాబు డిమాండ్ చేశారు. అభ్యుదయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మహబూబ్ బాష, జిల్లా నాయకులు గౌరిశంకర్, బి.విశ్వనాథ్ తదితరులు మాట్లాడారు.

అమరావతితో పాటు అన్ని ప్రాంతాలు అభివృద్ధి చేయాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి సర్కారు కేవలం అమరావతినే కాకుండా వెనుకబడి ప్రాంతాలను కూడా అభివృద్ధి చేయాలని వెనకబడ్డ ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వెనకడిన ప్రాంతల అభివృద్ధి వేదిక జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమరావతికి వేల కోట్ల రూపాయలు రాజధానికి కేటాయించి అభివృద్ధి చేయడం పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రాజధాని పేరుతో వెనుకబడ్డ ప్రాంతాలకు అన్యాయం చేస్తే సహించేదిఏలేదని స్పష్టం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా రాయలసీమ నుంచి సీఎంగా అవుతున్నారే కానీ వెనకబడ్డ రాయలసీమను అభివృద్ధి చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీఆర్వీ ప్రసాద్, నగిలి రాజేంద్ర ప్రసాద్, సగిలి గురప్ప, ద్రాక్షంశ్రీనివాసులు, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

శ్రమదానంతో కోనేరు శుభ్రం



సీకేదిన్నె, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రమదానం చేసి కోనేరు శుభ్రం చేశారు. స్థానికులంతా కలిసి చింతకొమ్మదిన్నె మండలం పురాతన శివాలయం వద్ద భృగు మహర్షిచే నిర్మితమైన కోనేరు నాగిరెడ్డిపల్లె, గూడావాండ్లపల్లె, బుగ్గలపల్లికి చెందిన ప్రజలు కోనేరును శుభ్రం చేశారు. గత ఆదివారం, ఈ ఆదివారం కోనేరు పనులను దగ్గరుండి శుభ్రం చేశారు. దీంతో కోనేరు పూర్తిగా శుభ్రమైంది. వర్షాలు వస్తే కోనేటిలోకి నీరు చేరి ఎంతో మందికి తాగునీటికి కూడా అవకాశాలు ఏర్పడుతాయి.

ఎఫ్‌ఏ -1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌ఏ-1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి విద్యార్థికి అసిస్టెంట్ బుక్‌లెట్ అందాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ టెక్ట్స్ బుక్స్ ప్రెస్ గుంటూరు రాము ఆదేశించారు. ఆదివారం వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అకస్మిక తనిఖీల్లో భాగంగా కడప నగరంలోని సీఎస్ఐ పాఠశాలలో గల డీసీఈబీ హాల్‌ను, వల్లూరు మండల వనరుల కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, కడప మండల విద్యాశాఖ అధికారి -2 షేక్ ఇర్షాద్ అహ్మద్, ఉమ్మడి జిల్లా బుక్స్ గోడౌన్ మేనేజర్ రామాంజనేయులు, దేవి, సిబ్బంది నరేష్, అనిల్, కడప సీఆర్ఎంటీలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గా,మల్లికార్జునుల శాంతి కల్యాణం





కడప కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విజయదుర్గా ఆలయంలో విజయదుర్గా మల్లికార్జునుల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలమధ్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ వైభవాన్ని వీక్షించడం వల్ల సకల కార్యాలు త్వరిత గతిన నెరవేరుతాయని అర్చక స్వాములు తెలిపారు. కళ్యాణం అనంతరం భక్తులకు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించారు.

'వాస్తవాలు గ్రహించి ఓట్లు వేయండి'

పులివెందుల రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ ఉప ఎన్నికల దృష్ట్యా వాస్తవాలు గ్రహించి ఓట్లు వేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎంపీ విలేకరులతో మాట్లాడారు. జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందన్నారు.ఎన్నికలను విజయవంతంగా నడిపించే శక్తి మహిళలకే ఉందని ఆ బాధ్యత మహళలు తీసుకొని పులివెందుల ఖ్యాతిని నిలబెట్టాలని కోరారు.

'బోధనేతర భారం తగ్గించండి'

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు బోధనేతర భారాన్ని తగ్గించాలని అసెస్‌మెంట్ బుక్స్‌లోని జవాబులను స్కాన్ చేయడాన్ని,విద్యాశక్తి కార్యక్రమాన్ని నిర్బంధం చేయడాన్ని ఎస్టీయూ జిల్లా శాఖ తరఫున బహిష్కరిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప ఎస్టీయూ భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.

ఘన నివాళి

కడప కల్చరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మా తెలుగుతల్లికి మల్లెపూదండ గీత రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతిని ఆదివారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో నిర్వహించారు. తొలుత సుందరాచారి చిత్ర పటానికి పూలమాల వేసినివాళులర్పించారు. సహాయ పరిశోధకుడు చింతకుంట శివారెడ్డి, కేంద్ర గ్రంథపాలకులు రమేశ్‌రావు, ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONBLE ADDITIONAL SENIOR CIVIL JUDGE, KADAPA.

I.P. No. 24/2025

Chilakala Suresh Babu S/o Chilakala Veerabadraiah, Hindu, Aged 46 years, Residing at D.No. 10/410-1, Bellam Mandi Street, Cuddapah City and District. **- Petitioner**

Vs

1. Akepati Mallikarjuna S/o Late Chandra Sekhar, Hindu, Aged 38 years, Residing at Door No. 11/683, Gaddi Bazar, Kadapa City and District, Cell : 8519999861, **2. Akepati Guru Murthy** S/o Late Akepati Gurappa, Hindu, Aged 65 years, Business, Residing at Door No. 14/132, Y.V.Street, Kadapa City & District, Cell : 9652505307, **3. Chilakala Guru Prasad** S/o Ramanaiah,Hindu, Aged 40 years, (Owner Nandini Water Plant) Residing at Parnapalli, Lingala Mandal, Kadapa District, Cell: 9491819888, **4. Aketi Ramesh Babu** S/o Guru Murthy, Hindu, Aged 40 years, Residing at D.No. 14/5, Pedda Bestha Veedi, Kadapa City and District, Cell : 8500068952, **5. K. Nagaraju** S/o late Subbaiah, Hindu, Aged 70 years, Retired Employee, Residing at D.No. 10/983, Trunk Road, Kadapa City and District, Cell : 9441145691, **6. Y.Subba Rao** S/o Guruvaiah, Residing at D.No. 72/9-1, Ganda Kamalanagar, Kadapa City & District, Cell : 9885712519, **7. Shaheed Mohammed** S/o not known, Muslim, Aged 65 years, C/o Gold Work Shop, Jaffer Al Mubarak Street, Cement House Backside, Sharak City, Cell : +96597534186, **8. Usman** S/o Shaheed Mohammed, Muslim, Aged 45 years, C/o Gold Work Shop, Jaffer Al Mubarak Street, Cement House Backside, Sharak City, Cell: +96597534186, **9. N.V.Ramana Reddy** S/o Late Uthama Reddy, Hindu, Aged 60 years, Business, Residing at D. No. 20/993, Co-operative Colony, Kadapa City and District, Cell: 9440119043, **10. Y.Venkata Subbaiah** S/o Late Krishnaiah , Hindu, Aged 40 years, Electrician Residing at D.No. 10/410, Bellam Mandi Veedi, Kadapa City and District, Cell : 9391228578, **11. K. Naga Rathnamma** W/o Nagaraju, Hindu, Aged 62 years, Business, Residing at D.No. 10/983, Trunk Road, Kadapa City and District, Cell:9908920129. **- Respondents**

జనరల్ నోటీసు

పై పిటిషన్‌లో పిటిషనర్ తనను Insolventగా Declare చేయమని పై పిటిషను దాఖలు చేసి ఉన్నారు. సదరు పిటిషనులో Respondentsలకు గాని మరియు ఇతరులకు గాని ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల 20-8-2025వ తేదిన, ఉదయం 10.30 గంటలకు పై తెలిపిన కోర్టు నందు, మీరు గాని, మీ తరపున వకీలు గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

//BY ORDER OF THE COURT//

V. RAMAMOHAN
K. RAMAMOHAN
B. AKBAR ALI KHAN
KISHAN MANDIRAJU
Advocates, Kadapa.

కాలువలను తలపిస్తున్న రోడ్లు

● అవస్థల్లో పోలుగారిపల్లె ప్రజలు ● పట్టించుకోని అధికారులు



పోలుగారిపల్లెలో రోడ్డుపై మోకాటిలోతు నిలిచివున్న వర్షపు నీరు

కడప రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : కడప నగరం 17 డివిజన్ పరిధిలోని పోలుగారిపల్లె గ్రామంలో రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. గ్రామంలోని సీసీ రోడ్లు లోతట్టు ప్రాంతంలో ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు లేవు. వర్షాలు వస్తే చాలు నీరు బయటికి వెళ్లడానికి వీలులేకుండా ఉంది. మూడు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండడం వలన రోడ్డుపై రెండు అడుగుల పైబడి వర్షం నీరు నిలబడి ఉంది. గ్రామస్థులు ఇంటి నుంచి బయటకి రావాలంటే నానా అవస్థలు పడుతున్నారు. గత్యంతరం లేక మోకాటిలోతు నీళ్లలోనే నడుచుకుంటూ వెళ్తున్నా రు. ఒకసారి వర్షపు నీరు రోడ్డుపై చేరిందంటే మూడు, నాలుగు వారాల వరకు అలానే ఉండిపోతోంది. దీంతో నీరు పాచిపట్టి దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధిచెంది వాటి కాటుకు గురైతూ విషజ్వరాల బారిన పడుతున్నారు. కార్పొరేటర్ దృష్టికి పలు మార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

కార్పొరేషన్ శాఖకు వేలకువేలు పన్నులను చెల్లిస్తున్నా తమ కాలనీలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ఎమ్మెల్యే అయినా తమ గోడును పట్టించుకుని రోడ్డుపై వర్షపు నీరు నిలబడకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...

ప్రారంభోత్సవం
జన్మదిన శుభాకాంక్షలు
ప్రమాణస్వీకారం
వివాహ మహోత్సవం
ఉద్యోగ విరమణ
విదేశీయానం
స్వదేశాగమనం

ఇప్పుడు ఆంధ్రజ్యోతి దినపత్రిక ద్వారా మీ ఆత్మీయులకు ప్రకటనలతో మరింత చేరువకండి, అందుకు మీ ప్రాంతంలోనే మా ప్రకటనల ప్రతినిధి అందు బాటులో ఉన్నారు సంప్రదించండి.

పొలిటికల్ యాడ్స్
షష్టిపూర్తి మహోత్సవం
సినిమా యాడ్స్
శ్రద్ధాంజలి
లీగల్ యాడ్స్
ప్రభుత్వ ప్రకటనలు
క్లాసిఫైడ్స్

ప్రకటనలపై జి.యస్.టి. 5% అదనం

యూనిట్ కార్యాలయం: సర్వే నెం. 137 & 138/3, చిన్నమాచుపల్లె చెన్నూరు మండలం, కడప. Cell: 9985411183, 9985411193, 9985411189.

ప్రాంతీయ కార్యాలయాలు :
కడప: Cell : 99854 11192, 99854 10691, 99854 02134
కమలాపురం : 9985411183 ప్రొద్దుటూరు : 9985921354, పులివెందుల : 9985411183
జమ్మలమడుగు : 9985401296 మైదుకూరు : 7989603861 రాజంపేట : 9985411193
రాయచోటి: 9985411193 బద్వేలు: 9985921375 కోడూరు : 9985411193

భారీవర్షం.. రైతుల్లో హర్షం



దువ్వూరు చెరువులో తొణికిసలాడుతున్న వరద నీరు



కొండాపురం మండలం చిన్నపల్లె గ్రామంలోకి చేరిన వర్షపునీరు

కొండాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):గత కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. మేనెల తర్వాత వర్షాలు ముఖం చాటేయడంతో ఖరీఫ్ సీజన్ ఇక అంతేనంటూ రైతన్నలు ఆందోళనలో పడ్డారు. అయితే శ్రీశైలం జలాశయం నిండి కేసీకెనాల్‌తోపాటు కుందూనది పరవళ్లు తొక్కడంతో పెన్నా తదితర నదులు పొంగిప్రవహిస్తున్నాయి. దీంతో కేసీ, కుందూ పరివాహక ప్రాంతాల రైతులు సాగు చేసిన పంటలు బాగా ఉండడంతో తక్కిన ప్రాంతాల రైతులు నిరాశలో పడ్డారు. ఇలాంటి తరుణంలో శుక్ర, శని, ఆదివారాల్లో భారీ వర్షాలు కురియడంతో ఇక తాగు, సాగునీటికి ఇక్కట్లు ఉండవంటూ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా కొండాపురం మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి నుంచి కురిసిన వర్షానికి పలుచోట్ల వాగులు, వంకలు ప్రవహించాయి. తిమ్మాపురం చెరువు కట్ట అడ్డం ఉండటం వల్ల మండలంలోని చిన్నపల్లె లోకి వర్షపునీరు వచ్చి చేరింది. ఇలా ప్రతిసారి వర్షం కురిసినప్పుడు ఇళ్లలోకి కూడా వర్షపునీరు వచ్చి చేరుతోందని చిన్నపల్లె గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామాన్ని ప్రభుత్వం ముంపులోకి తీసుకొన్న ప్పటికీ, ఇంతవరకు పరిహారం ఇవ్వలేదని వాపోతున్నారు. వెంటనే ప్రభుత్వం తమ గ్రామానికి ముంపుపరిహారాన్ని చెల్లించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎర్రగుంట్లలో: ఎర్రగుంట్లలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు అరగంటకు పైగా ఎడతెరపిలేని వర్షం కురవడంతో ప్రధాన రోడ్లు, వీధులు జలమయమయ్యానాయి. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు వీధుల్లో నీరునిలిచి ఇబ్బందులకు గురవుతున్నారు. సరైన డ్రైనేజీ లేక నీరు వెళ్లేందుకు దారుల్లేకఎక్కడి నీరు అక్కడే ఆగిందని ప్రజలు వాపోతున్నారు.

దువ్వూరులో చెరువులకు జలకళ

దువ్వూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సకాలంలో పడడంతో చెరువుల్లోకి సమృద్ధిగా నీరు చేరుతోంది. పైతట్టు వర్షపునీరు దిగువకు ప్రవహిస్తుండడంతో సాగునీటికి ఆస్కారం ఏర్పడింది. తెలుగుగంగ కాలువకు నీరు రాకతో చెరువుల్లోకి ఆ నీరు వచ్చి చేరుతోంది. మండలంలో దువ్వూరు, చింతకుంట చెరువులు ఇప్పటికే జలకళను సంతరించుకున్నాయి. తెలుగుగంగ ప్రధాన కాలువ నుంచి కొద్దిరోజులుగా దువ్వూరు చెరువులోకి నీరు ప్రవహిస్తుండడంతో రైతులు నీరుదొడ్లు పోసుకోవడం జరిగింది. చింతకుంట చెరుకువుకు సైతం తెలుగుగంగ నీరు వచ్చి చేరుతోంది. సబ్సిడరీ రిజర్వాయర్-1 నుంచి దిగువనున్న చెన్నముక్కపల్లె కాలువకు నీరు వదలడంతో చింతకుంట చెరువుతోపాటు మైదుకూరు ప్రాంతానికి వెళుతోంది. ఈనేపథ్యంలో ఆయకట్టు రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. మండల పరిధిలోని రెండు చెరువులు నిండడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

మైదుకూరు రూరల్, ఆగస్ట 10(ఆంధ్రజ్యోతి) :ప్రమాదాల్లో, అనారోగ్య సమస్యతో ఆసుపత్రుల పాలై లక్షల రూపాయలను ఖర్చు పెట్టుకొని ఆర్థికంగా వెనుకబడిన వారికి సీఎం సహాయనిధి ఒక వరం లాంటిదని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ప్రొద్దుటూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సుమారు 12 లక్షల రూపాయలను 20 మంది బాధిత కుటుంబాలకు పంపిణీచేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: సీఎం సహాయనిధి కింద మంజూరైన లక్ష రూపాయల చెక్కును బద్వేలు మాజీ ఎమ్మెల్యే అందించారు. పోరుమామిళ్లకు చెందిన టీడీపీ నాయకులు కనుమర్లపూటి రామసుబ్బారావు సతీమణి సిద్ధకుమారికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.లక్ష చెక్కు మంజూరైంది. ఆ చెక్కును ఆదివారం సిద్ధకుమారి భర్త కనుమర్లపూటి రామసుబ్బారావుకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అందించారు.

మున్సిపల్ అద్దె గదులకు వేలం

ప్రొద్దుటూరు , ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి చెందిన అద్దె గదులకు ఈనెల 12న ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహిస్తున్నాట్లు కమిషనర్ రవి చంద్రారెడ్డి తెలిపారు. ఇందులో గాంధీరోడ్డులోని వసంతపేట షాపింగ్‌కాంపెక్స్‌లో 9 రూములకు, స్టేట్‌బ్యాంకు పక్కన గల షాపంగ్ కాంప్లెక్స్‌లో 2 రూములకు టీబీ కాంప్లెక్స్‌లో 23 రూములకు ,పాత మార్కెలో 1 రూముకు మొత్తం 35 రూ ములను లీజు కు ఇచ్చుటకు ఈ వేలం పాటలు జరుగుతాయన్నారు. అద్దె గదులు లీజుకు పొందాలనుకునే వారు సాల్వెన్సి సర్టిపికేట్ తోపాటుఅన్ని ధృవపత్రాలు సమర్పించాలన్నారు.

పాదయాత్రగా బ్ర.మఠం చేరిన భక్తులు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన కర్త శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధానంలోకి ఆదివారం పులివెందుల నియోజకవర్గం తాతిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన భక్తులు సుమారు వంద మందికి పైగా ఆదివారం బ్ర.మఠం చేరుకునిస్వామిని దర్శించుకున్నారు. వారికి మఠం యాజమాన్యం ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు ప్రతి యేటా పాదయాత్రగా వచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నామన్నారు.

బహిరంగ ప్రకటన
ICICI Bank
నమోదిత కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్, చక్లీ సర్కిల్ సమీపాన, ఓల్డ్ పద్రా రోడ్, వడోదర - 390007
కార్పొరేట్ కార్యాలయం: ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి - 400051
బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన
బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ (ICICI బ్యాంక్) నుండి పొందిన (సౌకర్యం) తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవల...
తేది:11.08.2025
సం/- అధీకృత అధికారి
ఐసీఐసీఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

కోతకు గురైన రోడ్డు ..రాకపోకలు బంద్



కోతకు గురైన జమ్మలమడుగు-మైలవరం పెన్నా రోడ్డు

జమ్మలమడుగు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో పెన్నానది వరద ఉధృతి కొనసాగుతుండడంతో జమ్మలమడుగు మిఠాయిగిరివీధి, వేపరాల వెళ్లే రోడ్డు కోతకు గురైంది. ముందస్తుగానే ఇరిగేషన్ శాఖ అధికారులు ఆదేశాల మేరకు ఆ రోడ్డులో మట్టి కుప్పలు అడ్డంగా వేశారు. శనివారం, ఆదివారం తెల్లవారుజామున జమ్మలమడుగు ప్రాంతంలో భారీ వర్షం కురియడంతో పెన్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. రోడ్డు కోతకు గురికావడంతో దానవులపాడు, సున్నపురాళ్లపల్లె మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. మైలవరం నుంచి వచ్చేవారు ఉత్తర కాలువ బైపాస్ రోడ్డు గుండా జమ్మలమడుగు చేరుకోవాల్సి ఉంది. సున్నపురాళ్లపల్లె వారు దానవులపాడు మీదుగా ప్రొద్దుటూరుకు వెళ్లాలన్నా రోడ్డు కోతకు గురికావడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. అలాగే మండలంలోని సుగుమంచిపల్లె, దేవగుడి, దానవులపాడు, గొరిగెనూరు, అంబవరం, పొన్నతోట, మైలవరం మండలంలోని దొమ్మరనంద్యాల, పెన్నా పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణా శనివారం మధ్యాహ్నం నుంచి నిలిచిపోయింది. శనివారం సాయంత్రం నుంచి మైలవరం జలాశయం వరదనీరు. దాదాపు 10 వేల క్యూసెక్కుల మేర ఒకేసారి విడుదల చేయడంతో వరద ప్రవాహంతో ఇసుక గుంతలు నిండాయి.

ఉప్పలూరులో విద్యాదీపం సినిమా చిత్రీకరణ



విద్యాదీపం సినిమాకు క్లాప్‌కొడుతున్న ఎంఈవో నిర్మల

కాశినాయన ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): కాశినాయన మండలం ఉప్పలూరు సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో విద్యాదీపం సినిమా చిత్రీకరణ ప్రారంభమైందని హీరో ముత్తుముల లోకేశ్ తెలిపారు. ఈసినిమాకు ఎంఈవో ఓ. నిర్మల, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డిలు హీరో హీరోయిన్‌లపై క్లాప్‌కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా దర్శకుడు శ్రవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత విద్యావ్యవస్థ తీరు, ఇందులోని ప్రభుత్వ పథకాలు వంటి ఇతివృత్తాలన్నింటిని కలిపి ఈ సినిమా ఉంటుందన్నారు. ఇందులోని 3 పాటలు పోరుమామిళ్ళకు చెందిన తెలుగు లెక్చరర్ మహమ్మద్ రఫీ రాయడం విశేషం కార్యక్రమంలో సంఘసేవకుడు బి.నారాయణరెడ్డి,ఉపాధ్యాయ నాయకుడు సూరా భాస్కర్‌రెడ్డి చిత్రగణం పాల్గొన్నారు.

రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ

పోరుమామిళ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్‌మాధవ్ జన్మదిన సందర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు నారిశెట్టి నాగేంద్ర, పల్లెంశెట్టి పండరి, ఎన్.రమణచారి. డి.శ్రీనివాసరెడ్డి, వంకదార జయరాం తదితరులు పాల్గొని రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు.

దళితులపై దాడి చేయడం హేయనీయం

బద్వేలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో, రాష్ట్రంలో దళితులపై దాడులు చేయడం హేయమని పూలే అంబేడ్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో దళితుడైన నవీన్ ను అక్రమంగా లాడ్జికి తీసుకుపోయి చిత్రహింసలు పెడుతూ ఒక వీడియో వారి తల్లిదండ్రులకు పంపడం హేయనీయమన్నారు. దళితులపై దాడులు ఆపకపోతే దళితులంతా ఏకమై ప్రతిదాడులు చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జకరయ్య, సీనియర్ దళితనాయకుడు కేశవయ్య, ఎమ్మార్పీ ఎస్ జిల్లా అధ్యక్షులు శిఖామణిపాల్గొన్నారు.

అవినాష్ నీ ఆటలు ఇక సాగవు

చాపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలో ఎంపీ అవినాష్ రెడ్డి ఆటలు ఇక సాగవని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పులివెందుల జడ్పీటీసీ పోటీలో ఉన్న టీడీపీ అభ్యర్థి లతారెడ్డి గెలువడం ఖాయమన్నారు. పోలింగ్ బూత్‌లు నిర్ణయించేది ఎన్నికల అధికారి కలెక్టర్, తహసీల్దారు వైసీపీ అభ్యర్థి ఓడిపోతారనే భయంతో ఎన్నికల అధికారులు పోలీసుల మీద నిందలు వేయడం తగదన్నారు.

సమస్యల పరిష్కారం అధికారుల బాధ్యత

రాజుపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోనెలకొన్న సమస్యలు పరిష్కరించడమే కాకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలకందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఎంపీడీవో ఎం.రామనాధరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిషత్ సభాభవనంలో ఉప ఎంపీపీ నారాయణరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు అధికారులందరూ కృషి చేయాల న్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తెలిపారు.

హైవేపై నష్టం వాటిల్లినందుకు కేసు నమోదు

కొండాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదంలో నష్టం వాటిల్లిందని పోలీసులు కేసునమోదు చేశారు. శనివారం నేషనల్ హైవేపై పట్టణంలోని డివైడర్‌లను లారీ ఢీకొంది. దీంతో డివైడర్ దెబ్బతినడంతో రూ. మూడు లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని హైవే సిబ్బంది యాటగిరినరసింహులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఎస్ఐ సుదాకర్‌నాయక్ తెలిపారు.

టీడీపీనేతను దూషించినందుకు కేసు నమోదు

కొండాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు సీఎంఇందిరమ్మ ను దూషించినందుకు పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. ఈనెల 7 వతేది పట్టణంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న సీఎంఇందిరమ్మ నివాసం వద్దకు వెళ్లి సాల్మన్ మరో ఇద్దరు కలిసి దూషించారు. ఇందిరమ్మ, సురేష్‌రెడ్డిలు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్‌నాయక్ తెలిపారు.

వర్తక సంఘం అధ్యక్షుడిగా కొండపల్లె

● ప్రమాణస్వీకారానికి భారీగా తరలివచ్చిన ఆర్యవైశ్యులు



వర్తకసంఘం అధ్యక్షుడిని, గౌరవసలహాదారులను శాలువాతో ఘనంగా సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

బద్వేలుటౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):అమ్మవారి సన్నిధిలో అట్టహాసం గా వర్తక సంఘం అధ్యక్షుడిగా కొండ పల్లె చిన్నసుబ్బారావు ఆదివారం ప్ర మాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు గౌరవ అధ్యక్షుడిగా కనుమ ర్లపూటి రామచంద్రవరప్రసాద్, ఆర్యవైశ్య వర్తక సంఘం పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. దీనికి ముఖ్య అతిథులుగా మాజీ టీటీడీ బోర్డు సభ్యుడు ప్రసాద్, కడప జిల్లా ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షుడు పాల్గొని ప్రమాణస్వీకార మహోత్సవాన్ని నిర్వహించారు. నూతన అధ్యక్షునిగా బద్వేలు ఆర్యవైశ్యులు తమ ఓటు ద్వారా కొం డపల్లె చిన్నసుబ్బారావును ఎన్నుకోవడం జరిగింది. ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షుడిగా కొండపల్లె చిన్న సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడిగా కనుమర్లపూటి శ్రీరామచంద్రవరప్రసాద్, ఉపాధ్యక్షులుగా దర్శి సుబ్బరాజ, మాలెపాటి వెంకటేశ్వరరావు, జూటూరు నాగరాజ, సత్యనారాయణ ప్రసాద్, రవికుమార్, క్రిష్ణమూర్తి, కార్యదర్శిగా ఉరిమి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శులుగా బెస్తమల్ల సునీల్‌కుమార్, దిండుకుర్తి సుబ్బరాయుడు, సగల గోవిందస్వామి, సగల క్రిష్ణమూర్తి, ట్రెజరర్‌గా భూపాలం నాగరాజు, జాయింట్ ట్రెజరర్‌గా లక్ష్మీనారాయణప్రసాద్, గుబ్బా వెంకటేశ్వర్లు, తుమ్మల పెంట వెంకటసుబ్బయ్య, కొప్పరపు శ్రీనివాసులు, గౌరవ సభ్యులుగా సగల పెద్ద సుబ్ర మణ్యం, వెంకటసుబ్బయ్య, కిశోర్, దర్శి సుబ్రమణ్యం సముద్రాల రాధాక్రిష్ణమూర్తి, తుమ్మలపెంట సురేష్, వెంకటసుబ్బ య్య, బెస్తమల్ల వెంకటేశ్వర్లు, చిందుకూరి సాంబశివయ్య, పల్లెం సుధాకర్, తులసి నాగరాజ, తదితర కమిటీ సభ్యులచే ప్రమా ణస్వీకార మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



కార్యదర్శి సుభాషిణితో ఆశా వర్కర్లు

జమ్మలమడుగు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశా వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుభాషిణి డిమాండ్ చేశారు. ఆదివారం జమ్మలమడుగులో ఆశా కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఈనెల 30, 31వ తేదీల్లో కడపలో జరగనున్న ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో ఆశా కార్యకర్తలను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి రెగ్యులర్ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రమణమ్మ, సంపూర్ణకుమారి, ఉషా, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ప్రసాద్, చేనేత సంఘం జిల్లా అధ్యక్షుడు సిరివెళ్ల లక్ష్మీనారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం నేత నాగేంద్ర, ఏఐటీయూసీ నాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా యూటీఎఫ్ కృషి



యూటీఎఫ్ ఆవిర్భావదినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

బద్వేలు/పోరుమామిళ్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా యూటీఎఫ్ పని చేస్తోందని జిల్లా కార్యదర్శి శివప్రసాద్ పేర్కొన్నారు. 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద యూటీఎఫ్ పతాకాన్ని బద్వేలు మండల అధ్యక్షుడు దేవానందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ 1974 ఆగస్టు10న ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాతలు వెంకటస్వామి, చెన్నుపాటి లక్షుమయ్య, దాచూరి రామిరెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పాటైన యూటీఎఫ్ విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నదన్నారు. అనంతరం యూటీఎఫ్ బద్వేలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా దేవానందం, సుధాకర్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచిరెడ్డి, మస్తాన్ వలి, బాలయ్య, ప్రసాద్ ,మురళికృష్ణ, కొండయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని పాల్గొన్నారు. కాగా యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పోరుమామిళ్లలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోరుమామిళ్లలో యూటీఎఫ్ కార్యాలయం వద్ద సంఘం జిల్లా సాంస్కృతిక కోకన్వీనరు ప్రసాద్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంగమూర్తి, కాశినాయన మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేతలను కలిసిన నర్సాపురం సొసైటీ ఛైర్మన్



బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి రితీష్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సొసైటీ ఛైర్మన్ గురివిరెడ్డి

కాశినాయన ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): నర్సాపురం సొసైటీ నూతన ఛైర్మన్‌గా నియమితులైన జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సీనియర్ టీడీపీ నాయకుడు మురుకూటి గుర్విరెడ్డి (బంగారు గుర్విరెడ్డి) ఆదివారం బద్వేల్ మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, టీడీపీ సమన్వయకర్త కె.రితేష్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. తనపై నమ్మకంతో తనకు అప్పగించిన నర్సాపురం సొసైటీ ఛైర్మన్ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి మండల రైతాంగ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఆయన వెంట మండల తెలుగు యువత అధ్యక్షుడు పి.రవీంద్రారెడ్డి,టీడీపీ నాయకులు రోహిత్‌రెడ్డి, బి.వెంకట్రామిరెడ్డి(సీడ్స్), కోడిగుడ్లపాడు సర్పంచ్ బాలగురయ్య, సీనియర్ నాయకుడు దుగ్గిరెడ్డి, ఎల్.శ్రీనివాసులరెడ్డి, హుస్సేన్‌పీరా, రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ఉచిత వైద్యశిబిరం

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఇర్ఫాన్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం హోలిస్టిక్ ఆస్పత్రి సిబ్బంది సమక్షంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నవారిలో పలువురికి గుండె సంబంధిత వ్యాధి ఉన్నట్లు గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హోలిస్టిక్ ఆస్పత్రి డాక్టర్, సిబ్బందికి, ప్రజలందరికి ధన్యవాదాలు తెలిపారు.

రూ.12 లక్షలతో నూతన భవనాలకు భూమిపూజ

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలో రూ.12లక్షల వ్యయంతో అన్నదాన సంఘంలో రెండు నూతన భవనాలను నిర్మాణం చేపట్టేందుకు ఆదివారం భూమిపూజ చేశారు. ఈ నూతన భవనాలకు లక్కినేని బాలరాజుయాదవ్, ధర్మపత్ని సుశీల, బ్రహ్మయ్యయాదవ్ ధర్మపత్ని అచ్చమ్మ మాదాల బ్రహ్మేంద్రరావు .ధర్మపత్ని సుమతి, తోట బ్రహ్మయ్య రావులపల్లె శ్రీను, కోట్ల రాజయ్య, మూరబోయిన అంజనేయులు సహకారంతో అందించినట్లు కమిటీ సభ్యుల తెలిపారు. రాబోవు రోజుల్లో దాతల సహకారంతో కళ్యాణమండపం కూడా త్వరలోనే నిర్మాణాన్ని చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సమాజ సంఘం అధ్యక్షుడు పెరుగు క్రిష్ణయ్యయాదవ్, ప్రధాన కార్యదర్శి లక్కినేని బాలరాజుయాదవ్, కోశాధికారి మేకల పెదదన్నయాదవ్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జ్యోతి ఉత్సవాలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అమృతానగర్‌లో చౌడేశ్వరీదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురష్కరించుకుని జ్యోతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరీదేవి జ్యోతిని భక్తులు తలపై ఎత్తుకుని డప్పు వాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేస్తూ అమ్మవారిని స్మరించుకున్నారు. అమ్మవారి ఉత్సవమూర్తికి గ్రామోత్సవం నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు జ్యోతి ఉత్సవం నిర్వహించారు. భక్తులు దారి పొడవునా కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, పల్లా నరసయ్య, చౌడయ్య, వెంకటపతి, దాసు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466
జమ్మలమడుగు - S.R.: 94404 72816
మైదుకూరు - S.R.: 91334 42886
బద్వేల్ - S.R.: 99666 83437
D.C.M. : 99854 11184